ఒక్క తప్పుకూడా చేయని మనిషికంటే, తప్పుచేసి పశ్చాత్తాపపడినవాడే గొప్పవాడన్నారు. ఎందుకంటే, తప్పునుంచి తప్త సువర్ణంలా బయటికొచ్చిన మనిషి, మరింత మృదువుగా వుంటాడు. అప్పుడతను రూపెత్తబోయే ఆభరణం!

క్వాలిటీలో అయిస్‌క్రీం తిని బయటకొచ్చి సిగరెట్టు వెలిగించేను. టైము ఆరవుతున్నా వేసవి కాలం కావడం మూలాన ఎండ పోలేదు. బీచ్ అంతా సందడిగా వుంది. ఇంట్లో ఒంటరిగా మాట్లాడుకోవడానికి కుదరని మధ్య తరగతి సంసారపు జంటలు, రహస్యంగా ప్రేమాయణం సాగిస్తున్న యువజంటలు, గడచిన కాలంలో కష్టసుఖాల్ని తీరుబడిగా నెమరేస్తున్న వృద్ధజంటలు—వయోభేదం లేకుండా సముద్రపు టొడ్డున సేద దీర్చుకుంటున్నాయి.

పది నిముషాలు షా కోసం రోడ్డువెపు చూసేను. అతని జాడలేదు. బహుశా షిఫ్ట్‌లో వుండి వుంటాడు. మెల్లిగా కాస్త ఖాళీగావున్న చోటు చూసుకుని యిసుకలో కూర్చున్నాను. సుచిత్రకూడా లేదేమో నాకు తోచడం కష్టంగావుంది. తన స్నేహితురాలి పెళ్ళంటూ నాల్గురోజుల క్రితం బాంబే వెళ్ళింది. రేపో, యెల్లుండో రావచ్చు.

దూరంగా నూటయాభయ్యేడు మీటర్ల యెత్తున డాల్ఫిన్స్‌నోస్ పైనవున్న సెర్చిలైటు అరవైనాలుగు మీటర్ల పరిధిలో గిరికీలు కొడుతూ ఏడు మిలియన్ కేండిల్స్ కాంతిని విరజిమ్ముతోంది!

"తిండి లేకపోయినా ఫర్వాలేదు — విశాఖపట్టణం పరిసరాలు చూస్తూ బ్రతికేయచ్చు" అనిపిస్తుంది నాకు మాత్రం. తూర్పుతీరహారానికి పతకంలా భాసిస్తుంది విశాఖ! గంధర్వులు ఆకాశ విహారానికొచ్చినపుడు వారి కంఠంలోంచి తెగిన హారం నుంచి జారిన రవ్వల్లా ఊరంతా దీపాలు వెలిగేయి.

షా ఇంకా రాలేదు. బహుశా నా ముఖం చూడటానికి సిగ్గుపడుతున్నాడా? ప్రొద్దుట తను ఫోన్ చేసినపుడు తప్పక వస్తానన్నాడే! పని కాలేదేమో!

ఈ రోజు సుచిత్ర లేదు. షా లేదు. నాకు పరమ బోర్‌గా వుంది. పెళ్ళయిననాటినుంచి సుచిత్ర నన్నొదిలి ఎక్కడికీ వెళ్ళలేదు. అఫ్‌కోర్స్ నేనామెను వదలి కేంప్స్ పోవడం రివాజే.

సూరత్‌లో ఇంజనీరింగ్ చదివేటప్పుడు షా నాకు పరిచయమయ్యేడు. షా పూర్తిపేరు ప్రకాష్ షా. ఎత్తుగా, బలిష్టంగా, తెల్లగా, చూపరుల దృష్టిని యిట్టే ఆకర్షించగల అందం అతనిది. దానికితోడు మేలిమి బంగారంలో పొదగబడిన జాతిరత్నంలా పెదవులపై చెక్కు చెదరని చిరునవ్వు! ఆ ఆకర్షణే మా యిద్దరిమధ్య స్నేహానికి నాంది పలికింది. మనిషి యెంత అందగాడో మనసంత మెత్తన! ఆపైన చక్కని చిత్రకారుడు కావడం మరో యెస్సెట్! మా చదువు పూర్తయ్యేనాటికి మా యిద్దరి మధ్యా విడదీయలేని అనుబంధం ప్రేళ్ళూనింది.

నాకు విశాఖలోని ఒక రిమోట్ ఫర్మ్‌లో జాబ్ వచ్చింది. ఇంతలోనే సుచిత్రతో వివాహం కావడంకూడా జరిగిపోయింది. మా మేరేజ్‌కి షా కూడా అటెండయ్యేడు. అప్పుడే అతని చేత భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసెల్స్‌లో వేకన్సీస్ వున్నాయంటే అప్లై చేయించేను. దీనిలో కొంత స్వార్థంకూడా వుంది. స్నేహాన్ని పొడుగునా కాపాడుకోవాలనే వింత మనస్తత్వం నాది. షా కూడా యిక్కడే స్థిరపడితే మా స్నేహం నిరాఘాటంగా సాగుతుందనే కోరికే నన్నలా చేయించింది.

"నీ కోసమే రాష్ట్రేతరానికి వచ్చేస్తున్నా భాయీ" అన్నాడు ప్రకాష్ జాయినవడానికి వస్తున్నప్పుడు.


ప్రకాష్ వాల్తేరు అప్‌లాండ్సులో వుంటున్నాడు. ప్రతిరోజూ ఆఫీసునుండి రాగానే మా యింటికి రావడం, మాతో కలిసి భోంచేయడం అలవాటయిపోయింది. సుచిత్ర కూడా మంచి ఆర్టిస్టే. పైగా కలుపుగోలు మనిషి కావడంవల్ల మా కెలాంటి యిబ్బందులూ కల్గలేదు. నేను లేకపోయినా సుచిత్రతో మాట్లాడగల చనువు ప్రకాష్‌కి అలవడింది.

పదిహేను రోజుల క్రితం మేం ముగ్గురం కలిసి అరకు వేలీ వెళ్దామని నిర్ణయించుకున్నాం. అరకు వేలీ చూడాల్సిన సుందర ప్రదేశమైనా మా ప్రపోజల్‌కి



మరో ముఖ్యకారణం వుంది. ఇంటర్నేషనల్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి ఈసారి తమ పెయింటింగ్స్ కంట్రిబ్యూట్ చెయ్యాలని ప్రపోజ్ చేసేడు షా. అంతేగాక సుచిత్రని కూడా ఎంకరేజ్ చేసేడు. సుచిత్ర లాండ్‌స్కేప్స్ వేయడంలో సిద్ధహస్తురాలు.

# అరకులోయలో కూలని శిఖరం



మల్లెంశారద

కాని నాలుగ్గోడలమధ్య ఆమె వేసే చిత్రాలకి నేచురాలిటీ రాదని ప్రకాష్ వాదన. అందుకే ఆంధ్రలో అందాలు సంతరించుకున్న అరకు వేలీ వెళ్ళి అక్కడ ప్రత్యక్షంగా ఆ అందాలు ఫ్రేంలో బిగించాలని పట్టుబట్టేడు. పైగా ఈ జర్నీ రైల్లో చేయాలని నిర్ణయించుకున్నాం.

ఇంతలో నేను అనుకోకుండా హైదరాబాదు కాన్ఫరెన్సుకి వెళ్ళడం, అది ఎక్స్‌టెండ్ కావడాన అనుకున్న తేదీకి వెనక్కి-

# మల్లెపందిరి

## పాత కొత్తలు

కొత్తది అంటే మంచిదని. పాతది అంటే పనికిరానిదనీ చాలామందిఅంటారు. అయినా కొన్ని కొన్ని పాతబడినకొద్దీ గొప్పగా కనిపిస్తాయి.

'ఆనాడు కవిత్వం రాశారంటే- వాళ్ళూ కవులంటే' అనేవాళ్ళూ వుంటారు. అదంతా పాత చింతకాయ పచ్చడి లేవోయి అంటారు మరికొందరు. ఈ ప్రశ్న కాళిదాసు నాడు కూడా ఉండడంచేత-

పురాణ మిత్యేవ న సాధు సర్వం
న చాపి కావ్యం నవ మి త్యవద్యం
స న్తః పరీక్ష్యా న్యతర ద్భజ న్తే
మూఢః పర ప్రత్యయ నేయబుద్ధిః॥

అన్నాడు- పాతది ప్రతిదీ మంచిదీ కాదు. కొత్త కవిత్వం అంతా చెడ్డదీ కాదు. సజ్జనులు పరీక్షించి దేన్నో ఒకదాన్ని స్వీకరిసారు మూఢుడు మాత్రమే మరొకరి మాటనుబట్టి పోతాడు.

ఈ మాటనే ఒక సామాన్య సూత్రంగా వేదాంత దేశికుడిలా అంటున్నాడు:

తదాత్వే నూతనం సర్వ మాయత్యాం చ పురాతనం
న దోషా యైత దుభయం న గుణాయ చ కల్పతే॥

ఆనాటికది కొత్తదే. కొన్నాళ్ళు పోతే పాతదౌతుంది. ఈ కొత్తదనంలో గాని, పాతదనంలోగాని రెంటిలోనూ గుణమూ లేదు, దోషమూ లేదు.

—సౌభరి

---

వెళ్ళలేకపోవడం జరిగింది. దాంతో వాళ్ళిద్దర్నీ డిజప్పాయింట్ చేయడం యిష్టం లేక వాళ్ళిద్దర్నీ వెళ్ళవలసిందిగా ట్రంకాల్ బుక్ చేసి సుచిత్రకి నచ్చజెప్పాను.

సరిగ్గా అప్పుడే అసలు కథ ప్రారంభమయింది.

ఇలాంటి పరిస్థితులేర్పడతాయంటే నేనిలాంటి ప్రపోజల్ చేసి వుండేవాణ్ణి కాదేమో!

పైగా నాకా యిద్దరిమీద నమ్మకముంది.

కాని ప్రకాష్ అతి సున్నితమైన విషయానికే జరగరానిది జరిగినట్టు తెగ బాధపడిపోతున్నాడు. అందుకు అతని ఉత్తరమే సాక్ష్యం!

తన మనసు అంతరాల్లో జరిగిన సంఘర్షణకూడా దాచకుండా నిర్భయంగా తెలియబరచిన అతని నిజాయితీని మరోసారి అభినందించాను.

"ప్రకాష్ భాయీ! మన స్నేహం యెన్నటికీ చెడిపోదు." అనుకుని అతని లెటర్ మరోసారి చదవడానికి వుద్యుక్తుడనయ్యేను.

డియర్ శ్యామ్!

నిన్నుచూసి పదిరోజులు దాటింది. ఒకే వూళ్ళో వుంటూ యిలా దూరంగా వుండటం యిదే మొదటిసారి! నిన్ను చూడలేక- నీకు నా ముఖం చూపించలేక మాత్రమే నేను రాలేదు. ఒక క్షణం నాలో చెలరేగిన మానసిక బలహీనతే నన్నిలా సిగ్గుపడేలా చేస్తున్నది.

అఫ్‌కోర్స్- ఇది చెబితేతప్ప పైకి కనిపించేది కాదు. కాని దీన్ని దాచి నిన్ను మోసం చేయలేను. నాకు నేను ద్రోహం చేసుకోలేను. అందుకే నిజం నీ ముందుంచాలనే నిర్ణయానికొచ్చేశాను.

ఆరోజు నీ ట్రంకాల్ ననుసరించి నేను. చిత్రాభాబీ రైల్లో అరకువేలీ బయల్దేరేం. పెయింటింగ్‌కి కావాల్సిన పరికరాలు తీసుకుని నా ఫియట్ కార్లో డ్రైవర్ని రోడ్డుదారిన బయల్దేరమని చెప్పేను. బలిమెల ఐరన్ ఓర్ కోసం బయల్దేరిన గూడ్స్ ట్రెయిన్ చివరి కంపార్టుమెంటు మాది. అందులో మేమిద్దరమే వున్నాము.

రైలు శృంగవరపుకోట దాటింది. అంతవరకు బీడుగావున్న భూమి పచ్చదనాన్ని సంతరించుకుంది. చుట్టూ చిక్కటి మయిన చెటవల్ల మా బోగీ చీకటిగా మారింది. నేను లేచి లైటు వేసేను. కాస్సేపటిలో ట్రెయిన్ ఎత్తుమీదకు ఎక్కుతున్నట్లు ఫీలయ్యేము. ఇంకాస్సేపటిలో దట్టమైన అడవిలోకి రైలు ప్రవేశించింది. సడన్‌గా వాతావరణమే మారిపోయింది. అంతా దట్టంగా మబ్బులు! ఎటు చూసినా పొగమంచు!

తెరలు తెరలుగా జారుతున్న పొగమంచుతో కప్పబడిన లోయల్ని వంగి చూస్తున్న మాకు అకస్మాత్తుగా ఏమీ కన్పించడం మానేసింది. నేను ఆశ్చర్యం నుండి తేరుకోక మునుపే చిత్రాభాబీ కెవ్వున అరిచింది. నేను లేచి నిలబడేంతలో మళ్ళీ వెలుగు! ఆమె అలా అరిచినందుకు సిగ్గుగా నవ్వింది.

ఇంతకూ మా ఆశ్చర్యానికి కారణం మా ట్రెయిన్ ఒక కేవ్‌గుండా వెళ్ళడమే. కొండలు దొలచి, లోయల్ని మలచి రైలు మార్గం నిర్మించిన యింజనీర ప్రతిభని అభినందించకుండా వుండలేకపోయాను! తర్వాత అలాంటివి మరెన్నో గుహలు దాటిపోయేం. ఒక్క-క్షణం రెప్పవేస్తే యెలాంటి అందాలు కనుమరుగయిపోతాయోననే భయంతో కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తున్నాం. క్రింద అగాథమైన లోయ! అటూ,యిటూ ఎలాంటి ఆధారం లేకుండా గాలిలో వూగుతున్నట్లుగా మా రైలు సస్పెన్షన్ బ్రిడ్జిమీద తేలిపోతూ కలుగులోకి వెళ్తున్న పాములా గుహలోకి జారిపోతున్నది. సహజంగా ఇంజనీర్నయిన నేనే ఆ జర్నీ అంత థ్రిల్‌గా ఫీలవుతుంటే చిత్రాభాబీ గురించి ఏమని చెప్పను? ఆమె నాకు క్రొత్తగా కనిపించింది. ఎప్పుడూ గంభీరంగా పారే నదిలా వుండే ఆమె చిన్నపిల్లలా కేరింతలు కొడుతున్నది.

నాకు లోయల్లో దుడుకుగా దూకే జలపాతంలా కన్పించింది.

అడవిలో బెదురు చూపులతో అటూయిటూ పరిగెత్తే లేడిపిల్లలా అన్పించింది!

సరిగ్గా ఇండియన్ రైల్వేస్‌లో ఎత్తయిన స్టేషన్‌గా పేరుపొందిన శిమిలిగుడా ముందు ఒక వుదంతం జరిగింది. రైలు 'U' షేప్‌లో కర్వ్ తిరిగింది. అంటే గార్డుపెట్టె నానుకునివున్న మా

కంపార్టుమెంటుకి సమాంతరంగా మా ట్రెయిన్‌కి తగిలించిన యింజన్ వచ్చింది ఇదిచూసి వుత్సాహం పట్టలేని చిత్రా భాబీ "చూడండి! ఎంత గమ్మత్తుగా వుందో!" అంటూ ప్రక్కనే కూర్చున్న నా చేయి గట్టిగా పట్టుకుంది.

నేను షాక్ తిన్నాను. ఆమె ఈ ధ్యాసలో లేనేలేదు. సహజంగా ఆర్టిస్టయిన ఆమె హృదయం ఆ ప్రకృతి అవలోకనలో పరవశించిపోతున్నది. ఆ సంఘటన యాదృచ్ఛికమైనా నాలో తీవ్ర సంచలనం కల్గించింది. ఆమెచేసిన పని ఆమె గుర్తించే స్థితిలో లేకపోయినా అనుకోని విధంగా ఆమె స్పర్శ నిశ్చలంగా పారుతున్న నీటిలోకి విసిరిన రాయిలా నాలో తీవ్ర సంఘర్షణ లేవదీసింది.

ఆ తర్వాత కథే మారిపోయింది. నన్ను నేను కంట్రోలు చేసుకోవడం దుస్సాధ్యమయింది. ఎంత తల విదిలించుకున్నా నాలో వికృతమైన ఆలోచనలు చెలరేగుతున్నాయి. పరిసరాల అవలోకనలో మునిగిపోదామని ఎంత ప్రయత్నించినా మనసు పదేపదే చిత్రాభాబీ అందాలు పరిశీలించడంలోనే ఆనందం కనబరుస్తోంది!

"శ్రుతి మించకుండా వెనక్కి వెళ్ళిపోతే?" అనిపించిందో క్షణం! ఎంతో ఉత్సాహంతో ప్రయాణమయిన ఆమెకేం చెప్పగం? అందుకే నన్ను నేను నిగ్రహించుకుంటూ ముందుకి సాగడానికే నిశ్చయించుకున్నాను. అనుకున్న ప్రకారం రిజర్వు చేయించుకున్న గెస్టు హవుస్‌లో దిగేము. చీకటిపడింది. చిత్రాభాబీ తాను తెచ్చిన స్వీట్స్. పూరీలు తెచ్చి పెట్టి ఏవేవో కబుర్లు చెబుతున్నది. ఆమె ఉనిక నన్ను వెర్రివాణ్ని చేస్తున్నదని ఆమెకి తెలియదు!

కాస్సేపటికి పరధ్యానంగావున్న నన్ను అనుమానంగాచూస్తూ "వంట్లో బాగుండ లేదా? అలా వున్నారు?" అంది.

"జీ! కొంచెం తలనొప్పిగా వుంది." అన్నాను తప్పించుకునే వుద్దేశ్యంతో.

"ఒక్క నిముషం!" అంటూ బయట కెళ్ళి వాచ్‌మన్ సహాయంతో కాఫీ. ఎనాల్జిన్ తెప్పించి యిచ్చింది.

బలవంతంగా ఆ టాబ్లెట్ మింగి "ఎక్స్‌క్యూజ్‌మీ. కాసేపు పడుకుంటాను" అన్నాను నవ్వుతూ. ఆమె తన గదిలోకి వెళ్ళగానే తలుపులు మూసుకున్నాను.

నాలో ఉవ్వెత్తున లేస్తున్న బలహీనతలతో పోరాడి పోరాడి అలసటతో నిద్రలోకి జారిపోయేను. నేను నిద్రలేచేసరికే చిత్రాభాబీ తలస్నానం చేసింది పాల మీగడ లాంటి తెల్లని షిఫాన్ చీరకట్టి ముత్యాల దండ వేసుకుంది. తడి ఆరని నల్లని వెంట్రుకలు పట్టుకుచ్చులా గాలికి కదలాడుతుంటే ఆమె వాడిన షాంపూ తాలూకు సువాసనలు గదంతా పరచుకున్నాయి. కొండలపై సున్నితంగా కరచుకుని ప్రాకిన కాశీరత్నం తీగెలా పల్చగా ఆమె కట్టుకున్న చీర ఆమె వంపులని అంటిపెట్టుకుంది.

ఉలిక్కిపడ్డాను! మళ్ళీ అదే ఆలోచన! మళ్ళీ అదే బలహీనత! రాత్రంతా జోకొట్టిన నిద్రపుచ్చిన తలపులు వుదయాన్నే మేల్కొన్నాయి.

"ప్రకాష్‌జీ! మీరు చాల లేట్ చేస్తున్నారు. మనం బొటానికల్ గార్డెన్స్ చూద్దామనుకున్న విషయం మరిచేరా?"

"జస్ట్ యే మినిట్!" అంటూ ఆమెని

ఘనమైన రంజాన్ పర్వదినమునకు

వస్త్ర ఉత్పత్తిలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన

VIMAL A RELIANCE PRODUCT

100% పాలిస్టర్ సూటింగ్స్. షర్టింగ్స్. శారీస్ డ్రస్ మెటీరియల్స్ ఖరీదు చేసి పర్వ దినమును శోభాయమానం చేయండి.

విమల్ షో రూం, 'ఆరాధన',

కొత్తగూడెం.



నరముల బలహీనత, చర్మ, ఉబ్బసము, దగ్గు, ఎలర్జీ
స్త్రీ-పురుషవంధ్యత్వము, (గర్భాశయము వృద్ధి నొందక
ఋతు శూల, ట్యూబ్ బ్లాక్ మొదలైన కారణములచే
"డి.యన్.సి" చేసినను ఫలితము లేనివారికి)
కుసుమ వ్యాధి గల స్త్రీలకును... పురుషులకు శక్తిహీనత
ఏ కారణము చేతనైనను వీర్యకణములు లేక, తక్కువ,
కదలక యున్నను "వి.డి" మొదలైన మేహములకు,
బొల్లి, చర్మవ్యాధులకు, కార్శ్యము, వ్రణములు,
కీళ్ళ నొప్పులు, వాపులు, నంజు, అనేక సంవత్సరముల
నుండి యున్న దీర్ఘ వ్యాధులకు
డా॥ ఐ. అమర్‌నాథ్ A.R.A.C., గారిచే అనుభవపూర్వక,
శాస్త్రీయ పద్ధతిలో ఉత్తమ చికిత్స చేయబడును.
—ఉచితరోగ నిర్ణయఫారములకు వ్రాయండి.

PHONE: 709
దేశీయ వైద్య చికిత్సా కేంద్రము
పేరాల-523157
చీరాల తాలూక, ప్రకాశం జిల్లా (ఏ.పి.)

తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. ఇది అంత ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవడం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత ఇది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చునువిశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)



మనిషి అవసరాలను ప్రపంచం తీర్చ గలదుగాని ఆశలను తీర్చలేదు.

—గాంధీజీ

* * *

పూర్వకాలంనుండీ అనుభవంలో ఉన్న చిన్న పదాలకు "అవును", "కాదు" లు పలక డానికి ఎంతో ఆలోచించాల్సి ఉంటుంది.

—పైథాగరస్

* * *

మనం భయపడాల్సినదంటూ ఏదన్నా ఉంటే అది భయానికి మాత్రమే.

—రూజ్వెల్ట్

* * *

ప్రతి మనిషీ తనలో తానొక క్రూర జంతువే.

—ఫ్రెడరిక్ ది గ్రేట్

* * *

ప్రపంచంలో పైకిపోవాలనుకునేవాడు 'సర్వ నామాల' నుచ్చరించడంలో చాలా జాగ్రత్త వహిస్తాడు. "నీవు" అనేది ఇరవై సార్లుచ్చ రిస్తే "నేను" అనేది ఒకసారి పలుకుతాడు.

—జాన్ హే

* * *

విద్య అనేది పేదవానికి పెట్టుబడి కాగా, ధనికునికది వడ్డీ మాత్రమే.

* * *

నాయకత్వపు పిచ్చి ఎన్నో జీవిత నౌకలను నడిసముద్రంలో ముంచింది.

—స్వామి వివేకానంద

* * *

ప్రతి కష్టంలోను ఒక అవకాశం కన్పి స్తుంది ఆశావాదికి. ప్రతి అవకాశంలోనూ ఒక కష్టం కన్పిస్తుంది నిరాశావాదికి.

సేకరణ :

ఎం. జగన్నాథరావు, కర్నూలు

తప్పించుకుని బ్రష్ తీసుకునిబాత్రూంలో దూరేను. అద్దంలో నా ముఖం నాకే వింతగా కప్పించింది. ఎన్నాళ్ళుగానో నిద్రలేమికి నిరసించినట్లు లోతుకు పోయేయి కళ్ళు! మనిషిని బలహీనత యెంత బలంగా కృంగదీస్తుందో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. షవర్ తిప్పుకుని అంతటి చలిలోనూ చల్లటి నీళ్ళతో స్నానంచేసి డ్రెస్సయి బయల్దే రేను.

"కారులో వెళ్దామా?" అంది చిత్రాజీ.

"వద్దు. నడిస్తే అంతా పరిశీలనగా చూడొచ్చు" అన్నాను- కారులో ఏకాం తాన్ని తప్పించుకునేందుకు.

"ఓ.కే." అంటూ ముందుకు నడిచింది.

రాత్రి వర్షం పడ్డట్లుంది. లోయంతా కడిగి క్రొత్తగా రంగులు వేసినట్లుంది. కొండలపై పరచుకున్న నీరెండలో పచ్చని ప్రకృతంతా బంగారపు మలామా చేసి నట్లు మెరుస్తున్నది.

చిత్రాజీ చిన్నపిల్లలా గెంతుతూ, ఒక్కొక్క కోణంలో ఒక్కొక్క దృశ్యాన్ని పరికిస్తూ సన్నగా కూనిరాగాలు తీస్తున్నది. ఎక్కడైనా నచ్చిన దృశ్యం కనిపించినపుడు నోట్ బుక్‌లో రఫ్‌గా స్కెచ్ గీసుకుంటున్నది.

"మీరేం నోట్ చేసుకోవడం లేదే?" అంది ఆశ్చర్యంగా. నేను తడబడ్డాను. "నాకు లేండ్‌స్కేపింగ్ అంత లైకింగ్ కాదుగా! ఈ జర్నీ మీ కోసమే!" అన్నాను.

కాని నా కళ్ళు — నా మనసు నా ప్రమేయం లేకుండా ఆమె అందాల్ని ముద్రించుకోవడంలో నిమగ్నమయ్యే యని ఆమెకెలా చెప్పగలను!

చిత్రాజీ సెలయేటి నీళ్ళలో కాళ్ల తడుపుకుని మురిసిపోతున్నది. సన్నని యిసుకపై జాలువారుతున్న స్వచ్ఛమైన నీటిలో మొలచిన పద్మాల్లా వున్నాయి ఆమె పాదాలు. ఆమె వంగి నీటినిఅటూ, యిటూ విసిరింది. గాలికి తుంపరలు నా మీద పడ్డాయి. మళ్ళీ వుద్రేకం! దాన్ని చంపుకోవడానికి చెట్టుక్రిందకువెళ్ళి కూర్చున్నాను.

"మీరు చాలా మూడీగా వున్నారు. మనం రాకుండా వుండాల్సింది." చిరుకోపంగా అంది చిత్రాజీ

"నా బలహీనత ఆమె గ్రహించేయ లేదుకదా!" ఉలిక్కిపడ్డాను.

"మరి మీరు చిన్నపిల్లలా ఎక్కడంటే అక్కడ ఆగితే చూడవలసినవన్నీ ఎప్పుడు చూస్తాం?"

చిత్రాజీ తప్పు క్షమించమన్నట్లు లెంప లేసుకుంది గమ్మత్తుగా.

నేను నవ్వుతూ ఫాలో అయ్యేను.

బొటానికల్ గార్డెనంతా తిరిగి చూసేం. అక్కడ- ముఖ్యంగా చిత్రాజీని ఆకర్షించి అలరించినవి రంగు రంగుల గులాబీలు! మంచు బిందువులతో తడిసి, కని పెంచిన తల్లిమొక్కకే బరువనిపించేంత పెద్దవిగా కొమ్మకొనల వుయ్యాలలూగుతూన్నాయి! ఆమె ఆనందం, సరదాచూసి మాలి ఒక తెల్లగులాబీ కోసిచ్చేడు.

దూరంగా కొండమీదున్న శివాలయం చూడాలని పట్టుబట్టింది చిత్రాజీ. "ప్రకాష్‌జీ! అక్కడనుండి చూస్తే వేలీ అంతా యెంతో అందంగా కన్పిస్తుందట. చూద్దామా." అంది.

"మనం వచ్చిందే అందుకు! పదండి" అన్నాను. ఇప్పుడిప్పుడే మనసుని నిగ్రహం లోకి తెచ్చుకుంటున్నాను.

కొండ ఎక్కేముందు దాని ముందుగా వున్న పెద్ద ట్రెంచ్‌లో రాత్రి కురిసిన వర్షపు నీరు వడివడిగా పరిగెత్తుతున్నది. నేను జంప్‌చేసి దాటేశాను. అనాలోచితంగా ముందుకి నడుస్తూన్న నేను చిత్రాభాబీ పిలుపుతో వెనక్కి తిరిగి చూశాను.

ఆమె ట్రెంచ్ కవతల నిస్సహాయంగా నిలబడింది. ఒక చేతిలో తెల్లగులాబీతో తెల్లని చీరలో ఆమె వనకన్యలా వుంది. కుడిచేయి ముందుకి చాపి "హెల్ప్ మీ" అంది.

నేను అనుమానంగా చూశాను. ఆమె అందించిన చేయి అందుకోవడానికి లోలో పల ఘర్షణ! ఇంత సేపుగా కష్టపడి కూడ గట్టుకున్న నిగ్రహం పట్టు తప్పుతుందే మోనసే భయం!

ఆమె "ప్లీజ్!" అంది మళ్ళీ.

ఇంక ఆలస్యం చేస్తే ఆమె నన్ను నీచంగా భావించవచ్చు. మనసుని గట్టిగా బంధించి ఆమె చేయి అందుకుని ముందుకి లాగేను. ఒక్క ఉదుటున ముందుకి దూక డంలో నా గుండెలకి ఆమె తల ఆనింది. అదికూడా ఒకే క్షణం! నా చేతిలో నలిగిన మెత్తని ఆమె చెయ్యి ఎర్రబడిపోయింది. "అబ్బ! మీ చెయ్యి చాల మోటు!" చేతిని వూదుకుంటూ ముందుకు సాగింది.

సద్దుమణిగినట్లు నటించిన నా గుండె తిరిగి సందడి చేస్తున్నది! అదుపులేని నా మనసు హద్దు లేకుండా ఆలోచిస్తున్నది!

కొండవాలులో పూచిన ప్రొద్దు తిరు గుడు పూలమధ్య వరుగులు పెడ్తున్న చిత్రాజీని తాకాలని, ఒక్కసారి నా కౌగి లిలో బిగించాలని నా మనసు విజృంభి స్తోంది!

"ఆమె నా స్నేహితుడి భార్య! నాకు చెల్లెలిలాంటిది! నేను ఆమెను 'భాబీ' అని పిలుస్తున్నాను" ఇలాంటి సమర్థింపులు నాకు రుచించడంలేదు.

ఇంక నావల్ల కాదు! నా నరాల్లోని రక్తం విపరీతమైన వేగంతో ప్రవహిస్తున్నది!

వెంటనే ఒక్క క్షణంలో కొండదిగి గెస్ట్ హవుస్‌కి తిరిగొచ్చేసేను! "డ్రైవర్, శివాలయంలో అమ్మగారున్నారు. తీసుకురా!" అని చెప్పి రూమ్‌లోకి వెళ్ళి తలుపు బిగించుకున్నాను.

పది నిముషాల తర్వాత కారాగిన చప్పుడు! ఆ వెంటనే తలుపు టకటక! తలుపు తీయకపోతే చిత్రాజీ అపార్థం చేసుకోవచ్చు!

తీస్తే నేను అవమానకరంగా ప్రవర్తించొచ్చు!

"సారీ భాబీ! నాకేం బాగుండలేదు. లీవ్ మీ ఏ వైల్" అన్నాను.

ఆమెతో తిరుగు ప్రయాణంకూడా సులభం కాదని తెలుసు! అందుకే నమ్మకమైన డ్రైవరుకాబట్టి భాబీని విశాఖపట్నం తీసికెళ్ళమని చెప్పి, కాస పని వుందంటూ నేను వెనుక బస్‌లో వచ్చేసేను. ఈ విషయంలో భాబీ నీకు చెప్పిన కథనం ఎలా వుందో నాకు తెలియదు.

శ్యామ్! ఇప్పుడు చెప్పు! నేను క్షమార్హుడినేనా? ఆ క్షణం ఏ పిశాచం నన్నావహించింది? సంస్కారవంతంగా పెరిగిన నేను ఎందుకలా అయిపోయేను! ఇప్పుడు నేనెంత పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నా. నిష్కల్మషంగా నన్నాదరించిన మీ ముఖాలు ఎలా చూడగలను!

అందుకేనన్ను మరచిపో! భాబీకీ విషయాలేవీ తెలియనివ్వకు. ఆమె నన్ను క్షమించలేకపోవచ్చు.

ఇట్లు
నీ ప్రకాష్‌షా.

లెటర్ పూర్తిచేసి చుట్టూ చూసేను. వెలుగు గుడిగా వుంది. వేరుశెనగపప్పు. మామిడి ముక్కలు. మల్లెపూల అమ్మకపు కేకలు ఎక్కువయ్యేయి

దూరంగా ఆలివ్ గ్రీన్ ఫియట్ కారాగింది. మరి కాస్సేపటిలో మెట్లుదిగుతున్న షా కన్పించేడు. వెంటనే దగ్గరకి వెళ్ళేను.

"కాఫీ త్రాగుదామా?" అన్నాను పలుకరింపుగా.

"ఇప్పుడేం వద్దు" అన్నాడు తలదించుకునే. నా ముఖం చూసేందుకే సిగ్గుపడుతున్నాడు. ఇద్దరం వెళ్ళి సముద్రానికి దగ్గరగా కూర్చున్నాం. కాస్సేపు నిశ్శబ్దం మా మధ్య చోటుచేసుకుంది.

ప్రకాష్ వంచిన తల యెత్తకుండా గుప్పెళ్ళతో ఇసుక ఎత్తిపోస్తున్నాడు. చివరకి నేనే మాట్లాడటానికి ప్రయత్నించేను.

"షా! నువ్వంతగా బాధపడాల్సిందేమీ లేదు యిందులో. మనిషిని ఒంటరితనం. పరిస్థితులు ఒక్కొక్కసారి దిగజార్చేందుకే ప్రోత్సహిస్తాయి. ఆ క్షణం దానికి బానిసయి లొంగిపోకుండా నిలదొక్కుకున్నవాడే నిజమైన సంస్కారవంతుడు! నువ్వలానే ప్రవర్తించావు నిజానికి నిన్నభినందించాలి!"

నా మాట లతనిపై ఎలా పనిచేశాయో తెలియదు. ఒక్కసారి తలెత్తి చూసేడు. అందులో తడి! ఎదురుగావున్న లైటు కాంతిలో అతని ముఖం స్పష్టంగా కన్పిస్తున్నది. ఈ వారం పదిరోజుల్లో అతను మానసికంగా ఎంత బాధపడ్డున్నదీ. లోతుకుపోయిన కళ్ళు, పీక్కుపోయిన ముఖమే చెబుతున్నాయి.

"ప్రకాష్! నీకో గమ్మత్తయిన సంఘటన చెబుతాను. అప్పుడయినా నీవేదో తప్పుచేసేనన్న ఆలోచన వదులుకుంటావేమో!" అన్నాను.

ఏవిటన్నట్లు చూశాడు.

"మా ఆఫీసర్ బిహారీ గురించి నీకు కొద్దిగా తెలుసు! ఆయనకో కూతురుంది. పేరు రీనా బిహారీ. తల్లి చిన్నప్పుడే చనిపోవడంవల్ల ఆయన ఆ అమ్మాయిని చాల అపురూపంగా, గారంగా పెంచేడు. రీనా ఎమ్.ఏ. ఎంత్రొపాలజీ చేస్తున్నది సోఫిస్టికేటెడ్ ఫేమిలీస్‌లో చదువుకూడా ఒక అలంకారమే! ఇంట్లోవుంటే వాళ్ళకేం తోచదు. అందమైన ఫారిన్ కారులో ఎవరు తిరగాలి! అపురూపమైన డ్రెస్సులన్నీ ఎప్పుడు వేసుకోవాలి! అందుకే రీనా కూడా చదువుతున్నదని నా అభిప్రాయం.

"ఆమె అందం గురించి వర్ణించడం నా కిష్టంలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే అందానికి ప్రతీక రీనా. ఆమె తల్లి ఆంధ్ర, తండ్రి బెంగాలీ కావడాన, ఆంధ్రుల ఆకర్షణ, బెంగాలీల సున్నితం ఆమెకి వచ్చేయి. ముఖ్యంగా ఆ ముఖంలో చెప్పలేని వింత అందంతెచ్చిపెట్టేవి ఆమె కళ్లు. ఎవరివైపన్నా రెండు క్షణాలు చూసిందంటే ఆ మందభాగ్యుడు వలలో చిక్కిన చేపలా గిలగిల లాడాల్సిందే!

"బిహారీ తరచుగా ఆమెను కేంప్స్‌కి, కాన్ఫరెన్సులకి తీసుకురావడం. ఆమె ఆ టైములో కంపెనీ కారు తీసుకుని

విజయ
మాస పత్రికలో
సంచలనం సృష్టించిన
శ్రీప్రసాద్
చారిత్రాత్మక నవలలు
ఆర్యచాణక్య ..10.00
రోషనార ..8.00
అప్పాజీ ..10.00
యుగంధర్ ..12.00
ఇప్పటికే
వేయి కాపీలు పైగా
అమ్ముడై
మీ అభిమానాన్ని
చూరగొన్న పుస్తకాలు.
నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2.

షాపింగ్స్‌కి, సినిమాలకి వెళ్ళడం మామూలే! ఆ విధంగానే ఆమె నాకు పరిచయమయింది. నేనామెతో కలిసి తిరుగుతున్నా ఆమె అందానికి ఆకర్షితుడ్ని కాలేదని చెప్పడం గొప్పతనమే అవుతుంది. రీనా నాతో ఫ్రీగానే మాట్లాడేది. కాని మరోలాంటి అవకాశం ఎప్పుడూ యివ్వలేదు.

"కాని మొన్నటిసారి కేంప్‌లో అనుకోని సంఘటన జరిగింది. రీనా, నేను మామూలుగానే షాపింగ్‌కి వెళ్ళేము. ఆమె షాపింగ్ ముగించి కాస్సేపు ఇందిరా పార్కుకి వెళ్దామంది. అలా అలా తిరిగేము.

"ఆరు గంటలవుతుండగా "శ్యామ్‌జీ! మళయాళీ సినిమాలెలా వుంటాయి?" అంది.

"నాకేం చెప్పాలో తెలియలేదు. "నేను వాటినెక్కువగా చూడలేదు. వాటిలో సామాజిక స్పృహ వుంటుందని కొందరి వాదన" అన్నాను.

"ఆ పిక్చర్‌కి వెళ్దామా?" అంది ఎదురుగా కళ్ళు చెదరగొడుతున్న వాల్‌పోస్టర్లు చూపిస్తూ.

"అటు చూసేను. అది 'ఏ'సర్టిఫికెట్ పిక్చర్. సినిమాలో ఏమున్నదోగాని, అక్కడ పెటిన బొమ్మ మాత్రం అసభ్యంగా అరనగ్నంగా వుంది.

"రీనాని ఏమనుకోవాలో తెలియలేదు. డబ్బు, అధికారంలో పెరిగిన పిల్లలు నిస్సంకోచంగా, నిర్భయంగా ప్రవర్తించగలరనిపించింది.

"మీ డాడీ మనకోసం ఎదురు చూస్తుంటారు వద్దు" అన్నాను.

"యూ సిల్లీ, శ్యామ్‌జీ! మా డాడీ ఎప్పుడూ ఏమనరు. హీ యీజ్ నాట్ సచ్ ఎ టైప్" అంది.


కారు సినిమాహాల్ ముందాగింది. రెండు టిక్కెట్లు తెచ్చాను.

ఏ.సి. హాల్ చలగా, నిశ్శబ్దంగావుంది. పెద్దగా రష్ లేదు.

పిక్చర్ మొదలయింది. సబ్జక్టు ఏమైనా కావచ్చు! మొత్తంమీద సెక్స్‌ని ఎక్స్‌ప్లాయిట్ చేసున్న సినిమా అది! ప్రేక్షకులబలహీనతలపై రాళ్ళు విసురుతున్నది.

రీనా నిర్భయంగా సినిమాగురించి ప్రశ్నలు వేస్తున్నది. ఆమెకు జవాబులిచ్చేందుకు నేను నెర్వస్‌గా ఫీలవుతున్నాను. ఆమె స్లీవ్‌లెస్ బ్లవుజ్ వేసుకున్నది. ఆమె నున్నటి భుజాలు నాకు తగులుతున్నాయి. ఆమె స్ప్రే చేసుకున్న ఫ్రెంచ్ సెంటు తాలూకు సువాసనలు ఆహ్లాదం కలిగిసున్నాయి.

ఎదురుగా తడిసిన చీరలో హీరో




యిన్‌ని తెరమీద క్లోజప్‌లో చూపిస్తున్నారు. అనుకోకుండా నేను రీనావైపు చూసేను! రీనా నావంక చూసి చిలిపిగా నవ్వింది. ఆ కళ్ళనిండా కొంటెతనం!

సినిమా ఎలా అయిందో ఎప్పుడయిందో తెలియదు. హోటల్‌కి వచ్చీరాగానే గుడ్‌నైట్ చెప్పి నా రూంలో కొచ్చేశాను.

భోజనం ముగించి ఏదో నవల చదువుకుంటున్నాను.

కాలింగ్‌బెల్ మ్రోగింది. తలుపు తీశాను.

ఎదురుగా రీనా!

నైట్ గౌనులో వుంది. "మే అయి కమిన్?" అంటూనే లోపలికొచ్చింది. అప్పుడే స్నానం చేసినట్టుంది. కేవీ సోప్ తాలూకు సువాసనలు మెతగా వస్తున్నాయి. ఏ.సీ. రూమ్ చలిగొలుపుతున్నది. రాత్రి పదకొండు గంటలు దాటుతున్నది.

రీనా ఎందుకొచ్చింది! ఏవో ఊహలు! ఏవో ఆశలు! నా అనుమానాలు తీరుస్తున్నట్లుగా నా బెడ్ మీదే కూర్చున్నది! నా చేయి తన చేతిలోకి తీసుకుని "ఏవిటింత చల్లగా వున్నా"రంటూ వెక్కిరించింది. రీనా ఎందుకొచ్చిందో అర్థమవుతూనే వుంది. ఇందాక చూసిన సినిమా ప్రభావం ఆమె మీద చాలానే వుంది. తెలిసీ తెలియని వయసు — అందుబాటులోవున్న నన్ను కోరుకుంటున్నది.

ప్రస్తుతం ఆమె హీరోని నేను! ఆమెకెందరో రిచ్ ఫ్రెండ్సు వుండొచ్చు! కాని ఓ అందాల భరిణె, అపురూప సౌందర్యవతి, నాలాంటి వాళ్ళని యెంతమంది నైనా కొనగల ధనవంతురాలు ఒంటరిగా నా గదిలోకి వచ్చింది.

అంతకంటే ఏం కావాలి!

ఒకే ఒక క్షణం ఆమె కళ్ళలోకి చూసేను!

అవి నన్ను ఆహ్వానిస్తున్నాయి!

వెంటనే ఆమెని రెండు చేతులతో పెనవేసేను! మరో క్షణంలో ఆమె పెదవులపై వంగబోతున్నాను.

రింగ్....రింగ్ మంటూ ఫోన్ అదే పనిగా గోల చేస్తున్నది

విసుగ్గా ఒక చేతో ఫోనందుకున్నాను. మరో చేతిలో రీనా సన్నని నడుం వుంది.

"హల్లో! ఎస్సర్! ఆ వస్తున్నా.... ఇప్పుడే!" ఫోన్ హుక్‌మీద పెట్టేశాను. నా చేతుల్లోంచి జారిపోయిన రీనా కోపంగా చూస్తున్నది.

"సారీ రీనా! మీ డాడీకి మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చిందట! హాస్పిటల్లో జాయిన్ చెయ్యాలి. డోంట్ వర్రీ!" అన్నాను భుజం తటి.

రీనా కళ్ళనిండా నీళ్ళు! ఆ క్షణం ఆమె పసిపిల్లలా కన్పించింది. అలా ఆ గండం గడిచింది. తర్వాత రీనా తనతప్పు తెలుసుకుని క్షమాపణ కోరింది.

కాని.... ఇందులో రీనా అపరాధం ఏముంది? తెలిసీ తెలియని వయసు. ఒంటరితనం, సినిమా ప్రభావం ఆమెమీద తీవ్రంగా పనిచేసేయి.

మరి నా సంగతి! వివాహితుణ్ని, అన్నీ తెలిసినవాణ్నయిన నేనే నన్ను నేను నిగ్రహించుకోవడానికి ప్రయత్నించలేదు. అదృష్టం బిహారీ హార్ట్ ఎటాక్ రూపంలో రాకుంటే నేను పతనమవటమే కాకుండా రీనా జీవితం పాడుచేసేవాడిని. బ్రహ్మచారి వయినా నీవు చూపించిన నిగ్రహం అనితర సాధ్యం. ఇప్పుడు చెప్పు మనలో ఎవరు బలహీనులు?"

ప్రకాష్ నా వంక విస్మయంగా చూసేడు! ఆ చూపుల్లో అపనమ్మకం గోచరిస్తున్నది.

"ప్రామిస్! నీకు అబద్ధాలు చెప్పను. ఒకటిమాత్రం నిజం. ప్రతి మనిషి మనసులోనూ ఎత్తు పల్లాలుంటాయి. కొండ చరియల అందాలు అవలోకించేటప్పుడు దాని నానుకునివున్న లోయల సంగతి మరచిపోతాం. మనసుకూడ అలాంటిదే. ఎంత ఔన్నత్యంగా పెరిగినా యెక్కడో లోయలా బలహీనత వుంటూనేవుంటుంది. అయితే మనం ఆ బలహీనతకు లొంగిపోకుండా మసలుకోగల్గటమే గొప్పతనం! అదే నిజమైన సంస్కారం!"

ప్రకాష్ నా చేయి పట్టుకున్నాడు. నేనతని భుజంపై ఆప్యాయంగా చేయి వేశాను.